రైతులకు రుణ మాఫీ చేయాలి

తిర్యాణి, మార్చి 3: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ చేయాలని గడలపల్లి ఎంపీటీసీ, బీజేపీ జిల్లా నాయకుడు సారా రమేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఆదివారం బీజేపీ మండలాధ్యక్షుడు పులి వెంకటేశ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించారని తెలిపారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ఆ పథకంపై ఊసేలేదని ఆరోపించారు. మరో మూడు నెలల్లో ఖరీఫ్ సీజన్ సైతం ప్రారంభంకానుందని, రుణ మాఫీ చేయకపోతే రైతులు పెట్టుబడి ఇబ్బంది పడుతారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలు సమీస్తున్నందున ఈ లోగా పూర్తి స్థాయిలో రైతులకు రుణమాఫీ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. ఎన్నికల సాకుతో పథకాన్ని కాలయాపన చేసే ప్రమాదం సైతం లేకపోలేదన్నారు. గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించినా నేటికి అది అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఈ సమావేశంలో ప్రధానకార్యదర్శి ఆత్రం గోపాల్, తొంగల తిరుపతి, నాయకులు గేడం సుభాష్, తోడసం భాస్కర్, కనక హన్మంత్‌రావ్ , కోట్నాక బారిక్‌రావ్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గాదేవి ఆలయంలో పూజలు



కనకదుర్గాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రెబ్బెన, మార్చి 3: రెబ్బెన మండలం ఇందిరానగర్ కనకదుర్గాదేవి స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు దేవర వినోద్ తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- ప్రత్యేక కార్యాచరణతో సిద్ధమవుతున్న 'పది' విద్యార్థులు
- ఉదయం, సాయంత్రం స్పెషల్ తరగతులు
- మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయుల కృషి
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

కేజీబీవీలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

చింతలమానేపల్లి, మార్చి 3 : 'పది'లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కేజీబీవీ విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు ఉపాధ్యాయులు పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తున్నారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ, ఎప్పటికప్పుడు పరీక్షలు పెడుతూ ఫైనల్ ఎగ్జామ్స్‌కు సిద్ధం చేస్తున్నారు. దాదాపు సిలబస్ పూర్తి కాగా, ముఖ్యమైన సబ్జెక్టులపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తునానరు. గతంలో కంటే కేజీబీవీల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానోపాధ్యాలతో పాటు ఉపాధ్యాయులు సైతం ప్రత్యేక దృష్టిపెట్టారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి..

చింతలమానేపల్లి కేజీబీవీలో మొత్తం 34 మంది పదో తరగతి విద్యార్థులున్నారు. ప్రైవేట్‌కు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పాఠశాలలో ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. ఉదయం 6:30 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4:30 నుంచి 5:45 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. నిత్యం సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులను తీసుకుంటున్నారు. 100 శాతం మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో రోజువారీ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం..

పది పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ముందుకు కొనసాగుతున్నామని కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌వో శ్రీదేవి తెలిపారు. సిలబస్ ప్రకారం బోధన చేపట్టి ఫలితాలు సాధించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉత్తమ జీపీఏ సాధించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. ప్రత్యేక తరగతుల నిర్వహణ విద్యార్థులకు ఎంతో ఉపయోగమని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెడుతున్నామని వివరించారు.

మంచి మార్కులు సాధిస్తా..

మా సార్లు ఉదయం, సాయంత్రం పాఠాలు చక్కగా బోధిస్తున్నారు. సబ్జెక్టుల్లో వస్తున్న సందేహాలను ఎప్పటికప్పుడు ప్రత్యేక తరగతుల్లో అడిగి తెలుసుకుంటున్నాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించే లక్ష్యంగా ముందుకెళ్తున్నా. ఎప్పటికప్పుడు డౌట్స్ తెలుసుకోవడం వల్ల ప్రతీ సబ్జెక్టుపై అవగాహన పెరుగుతుంది. **- టీ స్పందన, పదో తరగతి, కేజీబీవీ**

ప్రణాళికతో సన్నద్ధమవుతున్నా..

పది పరీక్షల్లో 100 శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా సన్నద్ధమవుతున్నా. మా ఉపాధ్యాయులు సాధారణ తరగతులతో పాటు ఉదయం 6:30 నుంచి 8 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 4:30 నుంచి 5:45 గంటల వరకు ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారు. 10/10 జీపీఏ సాధించేందుకు కష్టపడి చదువుతున్న. తప్పకుండాసాధిస్తా. **- శ్రీ నిత్య, విద్యార్థిని, కేజీబీవీ**

కష్టపడి చదువుతున్నా..

ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు తీసుకుంటున్న. సబ్జెక్టుల వారీగా చదువుతున్నా. పదో తరగతి వార్షిక పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కష్టపడి చదువుతున్నా. ప్రతీ సబ్జెక్టులో మంచి మార్కులు వచ్చేలా సమయం కేటాయించుకొని మరీ ప్రిపేర్ అవుతున్నా. నా తోటి విద్యార్థులతో కలిసి అందరం గ్రూపుల వారీగా చదువుతున్నాం. **- ఎస్ పూజిత, విద్యార్థిని, కేజీబీవీ పాఠశాల**

దరఖాస్తు చేసుకొండి

తిర్యాణి, మార్చి 3: మండలంలోని రైతులు ఫాంపాండ్ నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఈజీఎస్ ఈసీ రజిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో ఫాంపాండ్‌కు ఈజీఎస్ నిధులు రూ.3లక్షలు చొప్పున మంజూరైనట్లు తెలిపారు. నీటి వసతిలేని ప్రాంతాల్లో వాన నీటిని ఫాంపాండ్‌లో నిలువ చేస్తే పంటలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పనులన్నీ ఉపాధిహామీ కూలీలతోనే చేపట్టనున్నట్లు తెలిపారు. ఇంకుడు గుంతల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో ఇంకుడు గుంతకు రూ.6.500, సామూహిక నీటి వసతి గల ప్రాంతాల్లో నిర్మాణానికి రూ.11వేల చొప్పున బిల్లులు చెల్లించనున్నట్లు తెలిపారు. ఒక్కో జీపీకి 12 చొప్పున సామూహిక ఇంకుడు గుంతలు నిర్మించుకునేందుకు అధికారులు ఈ అవకాశం కల్పించారని వెల్లడించారు. ఎంపీడీవో, ఈజీఎస్ కార్యాలయంలో అధికారులను సంప్రదించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గడువు పొడిగింపు

ఆసిఫాబాద్, మార్చి 3 : జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి 6 నుంచి 10వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుకు తుది గడువు ఈ నెల 11 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ గడువు ఈ నెల 2న ముగియగా విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు మోడల్ స్కూల్స్ అదనపు సంచాలకులు ఈ నెల11 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను సమీప మీ సేవా కేంద్రాల్లో, ఆన్‌లైన్ కేంద్రంలో సంప్రదించి telanganams.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7న నిర్వహించనున్నట్లు తెలిపారు.

రైతుపై అడవి పంది దాడి

ఉట్నూర్ రూరల్, మార్చి 3 : దంతన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మారుతి నగర్‌కు చెందిన రైతు కొడప జంగు ఆదివారం తన పంట చేనులో వ్యవసాయ పనులు చేస్తుండగా అడవి పంది దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. జంగు కేకలు వేయడంతో సమీపంలోని రైతులు వచ్చి కాపాడి స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్, ఎంపీటీసీ అనసూయ దవాఖానకు చేరుకొని బాధితుడిని పరామర్శించారు. డాక్టర్ మహేందర్ ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్‌లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న అడిషనల్ డైరెక్టర్ పద్మ

కెరమెరి, మార్చి 3 : ప్రతి పాఠశాల పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ టీసీఆర్ ఐటీ అడిషనల్ డైరెక్టర్, ప్రత్యేకాధికారి పద్మ అన్నారు. శనివారం మండలంలోని హట్టి, మోడీ ఆశ్రమ ఉన్నత పాఠశాలలను గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు రమాదేవితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు తీసుకువచ్చేందుకు అమలు చేస్తున్న కార్యచరణ గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. పిల్లలకు సమస్యలుంటే టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు వేర్వేరుగా సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీవో పురుషోత్తం, ప్రధానోపాధ్యాయులు ప్రేందాస్, సువర్ణలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు విస్తృతం చేయాలి

ఆసిఫాబాద్, మార్చి 3 : లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేయాలని లయన్స్‌క్లబ్ గవర్నర్ హన్మాండ్ల రాజిరెడ్డి అన్నారు. క్లబ్ అధ్యక్షుడు ఉబేద్ బిన్ యాహియా ఆధ్వర్యంలో మండలంలోని మాణిక్‌గూడలో ఆదివారం సేవాకార్యక్రమంలో భాగంగా కొలాం మహిళలు, విద్యార్థులు, యువకులకు దుస్తులు, పెన్నులు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌లోని ప్రతి సభ్యుడూ సేవా దృక్పథంతో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ నారాయణరెడ్డి, జిల్లా బాధ్యులు నారాయణరావు, నాంపల్లి శంకర్, రమణారెడ్డి, రావుల వినాయక్ రావు, పుల్లూరి శంకర్, రాజీవ్‌రెడ్డి, రావుల సవిత, నాంపల్లి పద్మ, మమతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పేద మహిళలకు దుస్తులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ గవర్నర్ హన్మాండ్ల రాజిరెడ్డి

శాంతి భద్రతల పరిరక్షణ అందరి బాధ్యత

కేంద్ర భద్రతా బలగాలతో కలిసి కవాతు నిర్వహిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సాగర్

వాంకిడి, మార్చి 3 : సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సీఐ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎస్ఐ సాగర్, కేంద్ర భద్రతా బలగాలతో కలిసి ప్రధానవీధుల గుండా కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలంతా శాంతియుతంగా, సామరస్యంగా ఉండేందుకు కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కవాతులో ఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ జితేందర్, ఇన్‌స్పెక్టర్ ప్రధాన్, వాంకిడి ఎస్ఐ సాగర్, పోలీసులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

వాంకిడి, మార్చి 3 : వాంకిడి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు. ఆసిఫాబాద్ మండలం జెండాగూడ గ్రామానికి చెందిన జాడి ఆకాశ్ బొలేరో వాహనంలో ఆసిఫాబాద్ నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా బంబార గ్రామ సమీపంలో పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. 11.40 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి పరీక్షలు

ఆసిఫాబాద్, మార్చి 3 : తెలంగాణ గురుకుల పాఠశాలల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ఆదివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. గురుకుల పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం ప్రవేశ పరీక్షలు నిర్వహించింది. 2100 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

నేడు మాదారంలో క్రీడలు

రెబ్బెన, మార్చి 3 : బెల్లంపల్లి ఏరియాలోని మాదారంటౌన్‌షిప్‌లోని కమ్యూనిటీహాల్‌లో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడలు నిర్వహించనున్నట్లు బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి ఓ ప్రకటనలో తెలిపారు. పర్సనల్ డిపార్టుమెంట్‌లో పేర్లు నమోదు చేసుకున్న మహిళలు సాయంత్రం 4 గంటలకు హాజరు కావాలని సూచించారు.

మద్యం విక్రయించే వారిపై కేసులు నమోదు చేయాలి

తాడిహత్నూర్‌లో ర్యాలీ తీస్తున్న గ్రామపెద్దలు, మహిళలు, యువకులు

నార్నూర్, మార్చి 3 : నాటు సారా, మద్యం విక్రయించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సంత్ సేవాలాల్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మద్యపానం నిషేధించాలంటూ తాడిహత్నూర్‌లో సంత్ సేవాలాల్ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, యువకులు ఆదివారం ర్యాలీ తీశారు. మద్యపాన నిషేధంపై తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంపూర్ణ మద్యపాన నిషేధ గ్రామంగా తాడిహత్నూర్‌ను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ రాథోడ్ మధుకర్, సంతోష్‌పటేల్, తానాజీనాయక్, కారోబార్ జాదవ్ పృథ్వీరావు, చౌహాన్ కిశోర్, సూర్యవంశీ, రాథోడ్ గణేశ్, ఆనంద్‌రావ్, సురేశ్, సంత్ సేవాలాల్ కమిటీ

పోలియో రహిత సమాజానికి కృషి చేద్దాం

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 3 : పోలియో రహిత సమాజం కోసం కృషి చేద్దామని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని సర్‌సిల్క్‌లోని యూపీహెచ్‌సీలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సీతారాం, డీహెచ్‌వో ఐజాక్, వాసుదేవ్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్రాచారి, అనిసుద్దీన్, సీవో సదాలక్ష్మి, చంద్రయ్య, సుమిత్ గుప్తా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్

జైనూర్: చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి

చింతలమానేపల్లి, మార్చి 3 : ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని ఎంపీపీ డుబ్బుల నానయ్య అన్నారు. ఆదివారం బాలాజీ అనుకోడ గ్రామంలో అధికారులతో కలిసి పిల్లలకు చుక్కల మందు వేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీదేవి, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, అగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బెజ్జూర్, మార్చి 3 : మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 29 బూత్‌లను ఏర్పాటు చేసి ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీలు పాల్గొని ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. మొత్తం 3004 మంది పిల్లలుండగా, ఆదివారం 2769 మంది పిల్లలకు.. 92.17 శాతం పూర్తి చేసినట్లు పీహెచ్ఎన్ కమలాబాయి తెలిపారు. మిగిలిన 235 మందికి సోమవారం ఇంటింటా తిరిగి పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం లంబీణినగర్, సలుగుపల్లి, బెజ్జూర్ బూత్‌లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్టు ఆయేషా తబస్సూం, ఏఎన్ఎంలు స్వరూప, సునీత, మంజుల పాల్గొన్నారు.

పెంచికల్ పేట్,మార్చి 3 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జడ్పీటీసీ సముద్రాల సరిత పల్స్‌పోలియో కార్యక్రమాన్ని వైద్య సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

ఆసిఫాబాద్, మార్చి 3 : చిన్నారులు భవిష్యత్‌లో అంగవైకల్యం బారిన పడకుండా ఉండేందుకు, వారి నిండు జీవితానికి రెండు చుక్కలు వేయించాలని ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎల్లారంలో ఎంపీపీ, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో సూపరింటెండెంట్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నిర్మల, మెడికల్ అధికారి వినోద్, సూపర్‌వైజర్ ఉత్తమ్, గోవర్ధన్, ఏఎన్ఎం వెంకటమ్మ, ఆశ కార్యకర్త భారతి, నాయకులు సీతారాం, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

చుక్కల మందుతో చక్కటి ఆరోగ్యం

వాంకిడి, మార్చి 3 : చుక్కల మందుతో చిన్నారుల ఆరోగ్యం చక్కగా ఉంటుందని ఎంపీపీ ముండే విమలబాయి అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత శేణ్రి ప్రభుత్వ దవాఖానలో ఎంపీపీ చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ వినయ్, హెల్త్ అసిస్టెంట్, సూపర్‌వైజర్, నర్సులు, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

92 శాతం పూర్తి

రెబ్బెన, మార్చి 3 : రెబ్బెన మండలంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో 92 శాతం పూర్తయినట్లు పీహెచ్‌సీ డాక్టర్ సుజిత్ తెలిపారు. మండలంలో 3174 మంది పిల్లలకు గాను 2926 మందికి చుక్కలు వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెబ్బెన ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్ , సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం వనిత, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేశ్, దుర్గం దేవాజీ, మాజీ సర్పంచ్ గంటుమేర, బీఆర్ఎస్ నాయకులు ఆనందరావు పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేయించాలి

జైనూర్, మార్చి 3 : ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండల కేంద్రంలోని సర్కారు దవాఖానలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో తుకారాం, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, డాక్టర్ సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు) మార్చి 3: పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి తుకారం, అదనపు వైద్యాధికారి సుధాకర్ నాయక్. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భగవంత్‌రావ్, నాయకులు నాగోరావ్, భూపతి పాల్గొన్నారు.

తిర్యాణి,మార్చి 3: మండల కేంద్రంలోని 30 పడకల దవాఖానలో జడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, మాజీ సర్పంచ్, ఈటీసీ చైర్మన్ గోపాల్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతలమానేపల్లిలో ఎంపీపీ డుబ్బుల నానయ్య

రెబ్బెన లో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య

గ్రామాల అభివృద్ధికి కృషి

అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్ బాబు

పెంచికల్ పేట్, మార్చి 3 : గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. ఆదివారం మండలంలోని దరోగపల్లి, చెడువాయి, గొంట్లపేట, కొండపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలంలో రూ.10 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణాలతో అంతర్గత రోడ్ల సమస్య పరిష్కారం కానుందన్నారు. కొండపల్లి, చెడువాయి గ్రామాల్లో పల్లె దవాఖానలు అందుబాటులోకి వస్తే మెరుగైన వైద్య సేవలు అందుతాయని తెలిపారు. నూతన మండలాన్ని మరింత అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించేందుకు సీఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధుకర్, నగేశ్, మహేశ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసు నిందితుడి అరెస్టు

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 3 : మహిళ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఆసిఫాబాద్ డీఎస్పీ, కాగజ్‌నగర్ ఇన్‌చార్జి డీఎస్పీ సదయ్య, కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు తెలిపారు. మండలంలోని మండువ గ్రామానికి చెందిన కమ్మరి రోజా(25) ఫిబ్రవరి 28న ఇంటి పెరట్లో మృతిచెందగా, తమ కూతురుని ఎవరో హత్య చేసి ఉంటారని 29న ఈస్‌గాం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రామన్‌కుమార్‌కు తల్లిదండ్రులు కమ్మరి కమల-గణపతి ఫిర్యాదు చేశారు. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, రూరల్ సీఐ నాగరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. రోజాకు పెళ్లి కాగా, భర్తకు విడాకులు ఇచ్చింది. ఈ క్రమంలో మృతురాలు రోజాకు విలేజ్ నంబర్ 13కు చెందిన సాగర్ మండల్‌తో ఏడాదిగా పరిచయం ఉంది. సాగర్ మండల్ రోజాను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మాయమాటలు చెప్పాడు. ఇదే క్రమంలో సాగర్ మండల్‌కు పెళ్లి సంబంధాలు వస్తున్న విషయాన్ని రోజా తెలుసుకొని ఫిబ్రవరి 28న తన ఇంటికి రమ్మని పిలిచింది.

నిందితుడు సాగర్ మండల్

ఆపై పెళ్లి చేసుకుంటావా లేదా అని నిలదీసింది. రోజా బతికి ఉంటే తన పెళ్లికి అడ్డుపడుతుందని భావించి గొంతు నులిమి చంపి అక్కడి నుంచి పారిపోయాడు. ఆదివారం సాగర్ మండల్‌ను అరెస్టు చేశారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి బైక్, మొబైల్ ఫోన్ సీజ్ చేసి రిమాండ్‌కు తరలించారు.